# పూజాఫలం

-ఆకెళ్ళ శ్రీరామకృష్ణ

"శారదగారూ రావాలండీ..."

"శారదా! శారదా!! ఎంతసేపూ, రా బయటికి!"

"ఆ వస్తున్నా..ఇదిగో ఒక్క క్షణం.."

"పంతులుగారు వచ్చి పూజకు అన్నీ సిద్ధం చేసారు. నువ్వు రావడమే ఆలస్యం.."

"ఆ ఇదుగో వచ్చేస్తున్నా.." లోపలనుంచి మళ్ళీ అదే సమాధానం.

"శారదా నా కండువా కనిపించడం లేదు ఎక్కడ పెట్టావ్. రా తొందరగా బయటికి..." అంటూ భర్త సుబ్రహ్మణ్యం కూడా పిలిచి ఆమె రాకకోసం ఎదురుచూసేవారిలో తనూ ఒకడయ్యాడు.

కొంతసేపు అయిన తరువాత భళ్ళున తలుపుతెరుచుకుంది.

చిలకాకుపచ్చరంగు పట్టుచీరలో మహాలక్ష్మిలా మెరిసిపోతూ వచ్చిన తన భార్య శారదను చూసి నిశ్చేష్టుడయ్యాడు సుబ్రహ్మణ్యం.

"మీ కండువా బీరువాలో రెండో అరలో పెట్టాను. కాస్త చూసుకోండి" తనవైపే చూస్తున్న భర్తకు హడావిడిగా సమాధానమిచ్చి వచ్చిన బంధువులను పలకరించడానికి వెళ్ళింది శారద.

హాలులో వున్న బంధుమిత్రులను పేరుపేరునా పలకరిస్తోంది.

"మీ ఇల్లు చాలా బాగుంది. ఎంత అయిందేమిటి?"

"మార్బుల్ స్టోన్ మంచి డీసెంట్‌గా వుంది.."

"వుడ్ వర్క్ సింప్లీ సూపర్బ్"

"శారద సెలక్షన్ అంటేనే స్పెషల్...ఏ పనిచేసినా అందంగా వుంటుంది"

పొగడ్తలతో ముంచెత్తుతున్న బంధుమిత్రులతో కలిసి ఆనందం పంచుకోవడంలో ఉక్కిరిబిక్కిరౌతోంది శారద.

"అమ్మా శారదమ్మగారూ...రండమ్మా వ్రతానికి అన్నీ సిద్ధం చేశాను. మీరొచ్చి కూర్చోవడమే తరువాయి.." పంతులుగారి పిలుపు.

"ఆ వస్తున్నా..ఒక్క క్షణం"

"రా శారదా.. పంతులుగారు ఇందాకట్నుంచి ఎదురు చూస్తున్నారు. ఆయన వేరే పనికి వెళ్ళాలిట.." భర్త సుబ్రహ్మణ్యం అభ్యర్థనకు శారద నుంచి చిరునవ్వే సమాధానమైంది.

ఆమె కళ్లు వాకిట్లో ఇంకెవరి కోసమో ఎదురు చూస్తున్నాయి. వాళ్ళు వచ్చిన తరువాతగానీ ఆమెకి పూజ ప్రారంభించడం ఇష్టం లేదు.

తొందరపడుతున్న పంతులుగారికి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు సుబ్రహ్మణ్యం.

"మా మిసెస్ వాళ్ళ బెస్ట్ ఫ్రెండ్స్ కొంతమంది రావాల్సివుందండీ. వాళ్ళు వచ్చాక పూజ ప్రారంభిద్దామని మా ఉద్దేశ్యం..మీరు కొంచెంసేపు ఓపిక పడితే.."

"దానికేం అలాగే కానివ్వండి.." ఏమి చెప్పాలో తెలీక గుటకలు మింగారు పంతులుగారు. మౌనంగా వుండటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఆయనది.

ఆ స్నేహితులెవరో తొందరగా రావాలని ఆ స్వామిని వేడుకుంటూ కూర్చున్నారు. ఆయన కోరిక ఫలించిందో ఏమో గానీ ఇంపోర్టెడ్ కారులో ఆధునిక నాగరికతకు నమూనాగా తయారైన కొంతమంది స్త్రీలు రావడం జరిగింది. వాళ్ళరాకతో ఆనందించిన శారద పూజకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బతుకుజీవుడా అనుకుంటూ పూజను ప్రారంభించారు పంతులుగారు.

దంపతులు పీటలమీద కూర్చుని పూజ ప్రారంభించింది మొదలూ రాబోయే వారిని పలకరించడం, వచ్చిన వారికి మర్యాదలు జరుగుతున్నాయోలేదోనని అక్కడున్న వారికి అవీ ఇవీ పురమాయించడం, మధ్యలో కొంత సేపు పూజ చేయడం జరుగుతోంది.

ఈ మధ్యలో వచ్చి కొంతమంది చెవిలో గుసగుసలాడుతున్న వారి సందేహాలను తీర్చడంలో మధ్య మధ్యలో సెల్‌ఫోన్ల సంగీతాలతో తలమునలైపోతున్నారా దంపతులు.

పూజ సహస్రనామార్చన వరకూ వచ్చింది. వచ్చినవాళ్ళందరూ ఒకళ్ళనొకరు పలకరించుకోవడాలు, పరిహాసాలాడుకోవడంతో హాలంతా సందడితో హోరెత్తిపోతోంది. పురోహితుడు చదువుతున్నదేమిటో పీటలమీదనున్న సుబ్రహ్మణ్యం దంపతులకే వినబడటం లేదు. ఇక మిగిలిన వారికేం వినబడుతుంది? కొంతమంది పూజ చూడాలని ఉత్సాహం చూపించినప్పటికీ పక్కనున్న వాళ్ళు పిలిచి మరీ కబుర్లు చెప్పడంతో మొహమాటానికి వాళ్ళూ కబుర్లలో పడుతున్నారు.

ఈ సందడిలోనే కొంతమంది కుర్రకారు పండీ పండని జోకులతో వీలైనంత హంగామా చేస్తున్నారు. కొంతమంది టిఫిన్ ప్లేట్లు తెచ్చుకుని తింటూ, టీవీ చూస్తున్నట్టు అప్పుడప్పుడు పూజ వైపు చూస్తూ ఫలహారాలు ఆరగిస్తున్నారు. అక్కడ కూర్చునే ప్రస్తుతం టీవీలో గత కొన్ని సంవత్సరాలుగా సాగే సీరియల్‌పై వ్యాఖ్యానాలు చేసేవారు కొందరైతే, క్రికెట్ మ్యాచ్‌లపై చర్చించుకునే వారు మరికొందరు. ఈ పరిస్థితిలో పూజ కథ దాకా వచ్చింది.

ఇంతసేపు పూజ చేసి అలసిపోయారు శారదా సుబ్రహ్మణ్యాలు. ఆ కథ తనకు తెలిసినదే కదా అన్న భావంతో సుబ్రహ్మణ్యం...."పంతులుగారూ ఐ నో దట్ ఫైవ్ స్టోరీస్....మీరు చెబుతూ వుండండి..మా రెలిటివ్స్‌ను పలకరించివస్తా. వాళ్ళు మళ్ళీ వెంటనే వెళ్ళిపోవాలంటున్నారు" నవ్వుతూ అంటూ అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు.

పక్కనేవున్న శారద పంతులుగారి వైపు మీరు కానివ్వండన్నట్టు చూసింది.. పంతులుగారు తిరిగి కథను ప్రారంభించగా లోపలినుంచి కబురు రావడంతో ఇప్పుడే వస్తానని చెప్పి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

అటువంటి పరిస్థితులకు అలవాటుపడినవారైన పంతులుగారు అక్కడ కూర్చుని పూజ చూడాలని ప్రయత్నిస్తున్న కొంతమంది పెద్దవాళ్ళనుద్దేశించి తిరిగి కథను చెబుతూనే వున్నారు. అక్కడవున్న వృద్ధులు కొందరు కథను వినాలని చేసే ప్రయత్నాన్ని మిగతావారు తమ కబుర్లతో అడ్డుకుం

టూనే వున్నారు.

అయినప్పటికీ పట్టుదలగా ఎలాగైతేనేం పూజ పూర్తిఅయింది అనిపించారు పంతులుగారు.

వెంటనే భోజనాల ప్రక్రియ బఫే పద్ధతిలో మొదలైంది. అందరూ క్యూలో నుంచుని ఎవరి ప్లేట్లలో వారు, ఎవరికిష్టమైన పదార్థాలు వాళ్ళు వడ్డించుకుని ప్లేట్లతో కుర్చీల కోసం పరుగులెట్టడం మొదలెట్టారు.

ముందు ప్లేట్ల కోసం ఆరాటం, తరువాత సీట్ల కోసం పోరాటం మొదలైంది. సీటు పొందలేని కొంతమంది నిరుత్సాహానికి గురైనా ఇదీ తమ మంచికేనన్నట్టు అందినవేవో హడావిడిగా నుంచునే నోట్లో కుక్కుకోవడం మొదలెట్టారు.

ఆ పరుగుపందెంలో గెలిచిన పిల్లలు సంబరంతో కుర్చీలను ఆక్రమించుకుని తన ప్లేట్లలోని పదార్థాలను కొంత తిని, మిగిలిన పదార్థాలను పక్కవారి ప్లేట్లలోకి విసురుతూ బాడ్మింటన్, త్రోబాల్ ఆడుకోసాగారు..

ఈ హడావిడిలో మంచినీళ్ళు దొరక్క ఇబ్బందివడేవాళ్ళు కొందరైతే, భోజనం మధ్యలో మిగతా పదార్థాలకోసం ఆరాటపడేవాళ్ళు కొందరు.

ఆ తోపులాటలో తాము చివరకు వచ్చేశామని గ్రహించిన కొంతమంది ముందుకు వెళ్ళే సాహసం చేయలేక, అందుకు తగిన అవకాశం కూడా లేక వున్నదాంతోనే భోజనం అయిందనిపించేశారు.

బఫేకు దగ్గరగావున్న కొంతమంది తినగల్గినంత తిని మిగతాది షోగ్గా ప్లేట్లలోనే వదిలేసి వెళ్ళిపోయారు.

ఆవిధంగా భోజన ప్రహసనం పూర్తికాగానే రాబోయే క్రికెట్‌మ్యాచ్‌ని తలుచుకుంటూ కొందరు, టీవీ సీరియల్స్ గుర్తొచ్చి మరికొందరు తిరుగు ప్రయాణమయ్యారు.

మరో పది నిముషాలకి అక్కడ జరిగిన తతంగానికి గుర్తుగా ఖాళీ పాత్రలు మాత్రమే మిగిలాయి.

వాన వచ్చి వెలసినట్లయింది వాతావరణం.

★ ★ ★

ఈ కార్యక్రమాన్నంతా గమనిస్తున్నారు సుబ్రహ్మణ్యం తండ్రిగారైన మార్కండేయశాస్త్రిగారు. ఆయన నిత్యానుష్ఠాన పరుడు. రిటైర్డ్ హెడ్మాస్టరు. తరతరాలుగా వస్తున్న సంస్కృతీ సాంప్రదాయాల పట్ల ఆయనకు భక్తిశ్రద్ధలు ఎక్కువ. వాటిని అమలు పరచడంలో ఆయన ఏనాడూ అశ్రద్ధ చూపలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన శంకరాభరణం శంకరశాస్త్రి టైపుమనిషి. తమ కుమారుని గృహప్ర







వేశానికి వచ్చిన ఆ వృద్ధ దంపతులకు ఈ సిటీ వాతావరణమంతా చాలా విడ్డూరంగా అనిపిస్తోంది. ముఖ్యంగా కొడుకు కోడలు ప్రవర్తన ఆయనకు అసలు నచ్చడం లేదు.

అదేమాట ఆయన భార్య కామాక్షమ్మగారితో అంటుంటే ఆవిడ తన భర్తను సముదాయిస్తూ "మన పిల్లాడు కష్టపడి ఇల్లుకొనుక్కుని..సరదాగా ఫంక్షన్ చేసుకుంటుంటే మనమొచ్చి ఏదో అని వాడి మనసుని బాధపెట్టడం ఎందుకండీ..అయినా మన చాదస్తాలు మనవి. ..వాళ్ళ సరదాలు వాళ్ళవి..నా మాట విని మీరు రెండురోజులు ఓపికపట్టండి.." అంటూ భర్తను సముదాయిస్తూ వుందామె.

ఎక్కడ ఎలా వుంటే అలా సర్దుకుపోవాలనే మనస్తత్వం ఆమెది. కానీ శాస్త్రిగారు అలాకాదు. పద్ధతులకు విరుద్ధంగా అశాస్త్రీయంగా ఎవరైనా ప్రవర్తిస్తుంటే తట్టుకోలేరు.

తప్పును చూసి వూరుకుంటే ఆ తప్పును సమర్ధించినట్లవుతుందని

## మంచి కాలక్షేపం



ఎప్పుడూ ఉండే రూమర్లు, షూటింగ్‌లు అన్నీ బంద్ చేసి ఇప్పుడు కొత్త కాలక్షేపంతో బిజీగా ఉంది మహిమా చౌదరి. 'పీపుల్ ఫర్ ద ఎతికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్స్'కోసం కొత్త యాడ్‌లో నటించింది మహిమా. 'సినిమాలకి దూరంగా ఇలా సామాజిక సేవా కార్యక్రమాలకోసం పాలు పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది' అంటోంది మహిమా. ఆ యాడ్‌లో ఆమె నిజంగానే దేవ్యకన్యలా ఉంది. జనం నుంచి సానుభూతి పొందేందుకు కాకుండా ఇలాంటి సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం తారలకి కొత్త ఇమేజ్‌ని తెచ్చి పెడుతుంది.




ఆయన అభిప్రాయం. తన తండ్రి విషయం తెలిసిన సుబ్రహ్మణ్యానికి కూడా మనసులో ఆందోళనగానే వుంది. నాన్నగారికి ఏమాత్రం అసౌకర్యం కలగకుండా చూసుకోమని తల్లికి, తన భార్యకు పదేపదే చెప్పాడు కూడా.

అతిథులందరు వెళ్ళిపోయారు హమ్మయ్యా అనుకునేసరికల్లా తండ్రి దగ్గరనుంచి కబురు వచ్చింది సుబ్రహ్మణ్యంకు. భార్యతో పాటు వెళ్ళి తండ్రి ఎదుట నిలబడ్డాడు హోంవర్కు చేయని విద్యార్ధిలా.

నొసటిన విభూతిరేఖలు, నుదుటిన కుంకుమ, మెడలో రుద్రాక్షమాల, పట్టు పంచె కండువాలో, సాంబశివుడి తేజస్సుతో వెలిగిపోతున్న ఆయన ముఖంలోకి చూస్తుండిపోయాడు.

ఆయన ఎదురుగా మాట్లాడాలంటే ధైర్యం చాలదు తనకి . పైగా ఇవాళ ఎందుకో చాలా కోపంగా కూడా వున్నారు అనుకుంటూ...

"నాన్నగారూ ఎందుకో పిలిచారట.."

"మీ హడావిడి అంతా అయిందా?"

"ఆ..అంతా బాగానే జరిగింది... మీరు అలా వచ్చి చూస్తే..." ఆపై ఏమి అనాలో తెలీలేదు.

"చూశాను...రాత్రినుంచి చూస్తూనే వున్నాను. మీ అమ్మ వారిస్తున్నా వుండబట్టలేక మీకు ఒక్కమాట చెబుదామని పిలిచాను.."

"ఏమిటో చెప్పండి"

"సంస్కృతీ సంప్రదాయాలనేవి తరతరాలుగా వచ్చేవి. వాటిని కాపాడుకోవడం మన ధర్మం. మా నాన్నగారు ఆస్తిపాస్తులతో వాటినీ నాకు అందించారు. నేను వాటిని నేటికీ పాటిస్తూనే వస్తున్నాను..నీవుకూడా వాటిని పాటించాలని నా ఆశ.."

"అలాగే నాన్నగారు..ఇప్పుడేమయింది.."

"పూజా కార్యక్రమం ఎలా జరిగింది? ఎంతసేపు జరిగింది?"

"నాన్నగారు అదీ.. పెద్ద పెద్ద ఆఫీసర్లందరూ వచ్చారు..వాళ్ళకి ఏర్పాట్లుచేయడంలో పూజకి ఎక్కువ సమయం కేటాయించలేకపోయాను.."

"వచ్చేవాళ్ళు భగవంతునికన్నా గొప్పవాళ్ళా...భగవంతుని కార్యక్రమం ఎవరికోసమో చేసుకునేది కాదురా..మనకోసం..మన క్షేమం కోసం చేసుకునేది. దానికి శ్రద్ధ, భక్తి ముఖ్యం..అంతేగానీ హంగులూ, ఆర్భాటాలు కాదు.."

"వచ్చినవారికి మర్యాదలు చేయక్కర్లేదంటారా మావగారు" భర్త తడబడటం చూసి శారద కలగచేసుకుంది.

"వచ్చినవారిని పట్టించుకోవద్దని కాదమ్మా నా ఉద్దేశ్యం..తప్పకుండా వారిని ఉచిత రీతిని గౌరవించాలి. 'అభ్యాగతః స్వయం విష్ణుః' మన ఇంటికి వచ్చిన అతిథులు సాక్షాత్ లక్ష్మీనారాయణ స్వరూపులు..కానీ అందుకు కొంత మందిని కేటాయించాలి. వాళ్ళు వచ్చినవారికి కావాల్సిన ఏర్పాట్లు చూస్తారు. మనం భక్తితో పూజ చేసుకోవాలి".

"పూర్వకాలంలోలా ఈ సిటీలో సహకారం చేయడానికంటూ ఎవరూ రారు మామగారు...అందరూ ఆ సమయానికే వస్తారు. ఎవరి హడావిడి వాళ్ళది.."

"అదే తప్పంటాను. దైవకార్యక్రమానికి హడావిడి అనేది పనికిరాదు. అలంకారాలు చేసుకోవడానికి లేని హడావిడి పూజదగ్గర ఎందుకమ్మా.."

ఆ మాటతో కోడలు తలదించుకుంది..ఏం మాట్లాడాలో తెలియక.

"సుబ్రహ్మణ్యం నువ్వు సంధ్యావందనం చేసి ఎంతకాలమైంది. చిన్నప్పట్నించి ఏనాడైనా ఔపోసన పట్టకుండా భోజనం చేసావా?"

ఈసారి తలదించుకోవడం సుబ్రహ్మణ్యం వంతు అయింది.

"చూడమ్మా నేను మిమ్మల్ని చిన్నబుచ్చాలని చెప్పడం లేదు. పంతులుగార్ని సహస్రనామాలు చదవమన్నావు. బాగుంది. పట్టుమని పది నామాలు విన్నారా..కనీసం ఒక్క కథ అయినా శ్రద్ధగా విన్నారా? మనకు భగవంతుని మీద శ్రద్ధ లేనప్పుడు ఆయనకు మనమీద ఆసక్తి ఎలా వుంటుంది? సాధారణ

మానవుడు ఇంటికి వస్తేనే ఇంత హడావిడి పడుతున్న మీరు ఆ భగవంతుడిని ఆహ్వానిస్తున్నామన్న భావనని ఎందుకు మర్చిపోతున్నారు. అలాగే వచ్చినవారికి కనీసం భోజనమైనా మీ చేతుల్తో మీరు విస్తరి వేసి వడ్డిస్తున్నారా! అదీ లేదు. అతిథిని ఆహ్వానించడమెలాగో మన శాస్త్రాల్లో స్పష్టంగా వివరించారు

శ్లో. సంప్రాప్తాయ త్వతిథయే ప్రవద్యా దాసనోదకే!
అన్నంచైవ యాథాశక్తి సత్కృత్య విధి పూర్వకమ్!!

దాని అర్థమేమిటో తెలుసా అతిథి ఇంటికి రాగానే ఎదురెళ్ళి, కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చి, లోనికి ఆహ్వానించి, ఆసనం చూపించి, రుచికరమైన పదార్థాలు మనకు శక్తివున్నంతలో వడ్డించి, తదుపరి తాంబూలం ఇచ్చి, వారు విశ్రాంతి తీసుకునేందుకు తగు ఏర్పాట్లు చేసి, వాళ్ళు వెళ్ళేటప్పుడు వాళ్ళ ఆశీర్వచనాలు తీసుకుని వాళ్ళకూడా కొంతదూరం వెళ్ళి సాగనంపి రావాలని దాని అర్థం..

మిగతా రోజుల్లో మాటెలాగున్నా దైవకార్యాల సమయంలో మనింటికి వచ్చిన వాళ్ళని ఆ విధంగా గౌరవించడం వల్ల వచ్చిన వాళ్ళు తృప్తిగా భోజనం చేసి వెళ్తారు, అప్పుడు భగవంతుడూ సంతోషిస్తాడు. ఇక్కడ భోజనం చేసి వెళ్ళిన వారిలో ఎంతమంది సుష్టుగా కడుపారా భోజనం చేసి వెళ్ళారో చెప్పండి. ఇదంతా వింటే మీకు నవ్వు రావచ్చు. చాదస్తం అనిపించవచ్చు.

చక్కగా కూర్చుని తినడానికి, వచ్చిన వారికి తృప్తిగా భోజనం పెట్టడానికి కూడా సమయం లేనప్పుడు ఎందుకమ్మా ఈ పూజలు? బర్త్‌డే, మ్యారేజ్‌డే ఫంక్షన్లప్పుడు మీ ఇష్టప్రకారం చేసుకోండి. కానీ దైవకార్యాలు చేసేటప్పుడు మాత్రం హంగులు, ఆర్భాటాలకి పోకండి. ఒక్కసారి ఆలోచించుకోండి. ఎక్కువమందిని పిలుచుకుని హడావిడిపడే బదులు కొద్దిమందినే పిలుచుకోండి. మీరు చక్కటి భక్తిశ్రద్ధలతో పూజ చేసుకుని వచ్చిన వారికి తృప్తిగా మీ చేతులతో భోజనం పెట్టి పంపించండి. మిగతావారికి మీకు నచ్చిన రీతిలో మరో రోజు పార్టీ ఇచ్చుకోండి.

పూజల్ని, పార్టీల్ని కలిపి ఇలా హైరానా పడడం ఎందుకు? మీరనే కాదు. ఒకళ్ళని చూసి మరొకరు.. ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. డబ్బులు ఖర్చుపెడ్తున్నారు కానీ ఫలితాన్ని పొందలేకపోతున్నారు. సంప్రదాయాల్ని వదిలేస్తున్నారు. తద్వారా పూజాఫలాన్ని కోల్పోతున్నారు. అదే నా బాధ. మీరైనా మనింట్లో ఈ పద్ధతులని మార్చండి. నాది చాదస్తం అనుకోండి ఏమైనా అనుకోండి. పెద్దవాడిగా నా ధర్మప్రకారం నేను చెప్పాను. ఆపై మీఇష్టం..'' అంటూ లేచారు శాస్త్రిగారు.

"మీరు చెప్పినట్టే చేస్తాం నాన్నగారు'' అంటూ సుబ్రహ్మణ్యం తమ గదిలో కొచ్చాడు.

మామగారి హితబోధ శారదకు రుచించలేదు. రుసరుసలాడుతూ వచ్చింది భర్త దగ్గరకు..

"ఈ పెద్దవాళ్ళు ఎప్పుడూ ఇంతే. తాతల నాటి కబుర్లు చెప్తూ వుంటారు. చేసినదానికి ఏదో వంకలు పెడుతుంటారు.. అంతమందికీ తీరిగ్గా వడ్డించడానికి చోటేదీ? మనం చేస్తామంటే మాత్రం వచ్చినవాళ్ళు అంతసేపుకూర్చుంటారా?! అయినా మీరేమిటి ఆయనేం చెప్పినా బుర్రవూపుతారు తప్ప సమాధానం చెప్పరేం?''

"నాన్నగారు చెప్పిందాంట్లో మాత్రం తప్పేం వుంది శారదా!''

"అంటే! మీరు, నేను ఉద్యోగాల్లో బిజీ. అలాంటప్పుడు మనం పూజలకంటూ, అతిథిసత్కారాలంటూ చేయడానికి అంత టైమేదీ? ''

"టైం లేదనకు శారదా మనకు శ్రద్ధలేదను ఒప్పుకుంటాను. మనం మన సరదాలకని ఎన్ని శెలవులు పెట్టకోవడం లేదు. ఎంత సమయం వృధా చేయడం లేదు. కానీ పూజల విషయానికొచ్చేటప్పటికి మాత్రం టైం లేదని సరిపెట్టేసుకుంటున్నాం. అయినా పెద్దవాళ్ళు చెప్పకపోతే సాంప్రదాయాలు మనకు ఎలా తెలుస్తాయి? నా చిన్నప్పుడు నాన్నగారి దగ్గర పెరిగినదానికీ ఇప్పటి పరిస్థితికి చాలా తేడా కన్పిస్తూవుంది. రెండు పూటలా సంధ్యావందనం, దైవప్రార్థన చేస్తే నేగానీ వూరుకునే వారు కాదు. చిన్నతనం చేత చిరాగ్గా అనిపించినా క్రమేపీ అవే అలవాటైపోయాయి.. ఆరోజుల్లో ఎంత శ్రమపడినా అలసట అనిపించేది కాదు.. చాలా ఉత్సాహంగా వుండేది. నేడు ఈ బిజీ బతుకులో పడి పూజా పునస్కారాలు అన్నీ వదిలేశాను. ఇంత సంపాదిస్తున్నా ఎక్కడో ఏదో అసంతృప్తి, ఏదో లోపం చేస్తున్నట్టు మనసు పీకుతూనే వుంది. మనశ్శాంతి కరువౌతోంది. యాంత్రిక జీవితమైపోయింది... ఏదో కోల్పోతున్నట్టు, ఏదో వెలితిగా అన్పించడం లేదూ.. నువ్వుకూడా ఒక్కసారి ఆలోచించు..ఈ ఉద్యోగం రాక ముందు ఎలావుండేదానివి?''

భర్త మాటల్లోని ఆవేదనని అర్థం చేసుకున్న శారద తను కూడా మామగారి మాటల్లోని సారాంశాన్ని అర్థం చేసుకోసాగింది.

★

## తస్మాత్ జాగ్రత్త

పిండి పదార్థాలుగల బియ్యం, గోధుమలవంటి ధాన్యపు గింజలు, బంగాళాదుంపలు ఉడకబెట్టినప్పుడు ఎటువంటి ప్రమాదము ఏర్పడదు. కానీ వాటిని వేయించినప్పుడు, మగ్గపెట్టినప్పుడు ఎక్రిలమైజ్ అనే ముడి పదార్థం వాటిలో తయారవుతుందిట. దీనికి క్యాన్సర్ కలిగించే దుర్లక్షణం వుందని, అందుచేత పొటాటో చిప్స్, బిస్కెట్లు, బ్రెడ్‌లాంటివి అతిగా తినడం ప్రమాదకరమని స్వీడన్‌లోని స్టాక్‌హోమ్ యూనివర్శిటీలో రీసెర్చ్ చేస్తున్న సైంటిస్టులు అంటున్నారు.

## అద్దాల బట్టలు

ఫ్యాషన్ డిజైనర్లకు ఒక శుభవార్త. త్వరలోనే అద్దాల బట్టలు మార్కెట్‌లో వుంటాయిట. ఫ్రెంచ్ శాస్త్రజ్ఞులు ఎలక్ట్రో ప్లేటింగ్ ద్వారా మెటల్ కోటింగ్ చేసిన దారాన్ని తయారు చేస్తున్నారు. ఈ దారంతో తయారు చేసే క్లాత్ అద్దంలా మెరుస్తుందిట.

## కూతురు సాహసం

ఫిన్‌లాండ్‌లోని మెయిమ్‌గ్రోన్‌లాండ్ అనే 25 ఏళ్ళ యువతి ఇంటర్నెట్‌లో ఒక ప్రకటన ఇచ్చింది. ఎవరైనా మంచి స్త్రీకి మా నాన్ననిచ్చేద్దామని అనుకుంటున్నానని, ఆయనతోపాటు ఫర్నిచర్ ఫ్రీ అని ప్రకటించింది. పెళ్ళయిన కూతురు ఇంట్లో తండ్రి ఉండడం ఈ ప్రకటన ఇవ్వడానికి కారణమట.

-తటవర్తి

